## క్లుప్తంగా

### రహదారి భద్రతపై అవగాహన కల్పించాలి



రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు రహదారి భద్రత నిబంధనలపై వాహనదారులకు విస్తృత ప్రచారంతో అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం స్పందన భవనంలో జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వాహనదారులు రహదారి భద్రత ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీటీసీ బి. చందర్, పశుసంవర్ధక శాఖ జేడీ బేబిరాణి, డీసీహెచ్ఎస్ మూర్తి, జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్‌నాయక్, ఆర్టీసీ ఆర్ఎం సుధాకర్, జి.జి.హెచ్ ఆర్ఎంఓ చైతన్య వర్మ, ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు, జాతీయ రహదారుల సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

### 1 నుంచి 5 వరకు బైబిల్ స్కూల్ తరగతులు



సండే స్కూల్ టీచర్లతో సంఘ కాపరి అగస్టిన్

ఒంగోలు టౌన్: నగరంలోని జె.ఎం.బి చర్చ్ సంఘం ఆధ్వర్యంలో మే 1 నుంచి 5వ తేది వరకు ఒకేషనల్ బైబిల్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సంఘ కాపరి డిజే అగస్టిన్ తెలిపారు. శుక్రవారం నగరంలోని వివిధ సెంటర్లలోని సండే స్కూల్ టీచర్లకు ఒకేషనల్ బైబిల్ స్కూల్ నిర్వాహణ గురించి శిక్షణ ఇచ్చారు. 6వ తేదీన నగరంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం చర్చి ఆవరణలో జరిగే కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. వై.స్వరూప్ కుమార్, రి పి.జెరూషా, కె.రవి, సత్య కుమారి, పి.సుజాత, డి.ఆశీర్వాదం పాల్గొన్నారు.

### అన్నదానం అభినందనీయం



అన్నదాన కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్

ఒంగోలు అర్బన్: శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి గత 300 రోజులుగా పేదలకు, అనాథలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్‌నాయక్ అన్నారు. శుక్రవారం జీజీహెచ్‌లో జరిగిన అన్నదాన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రకాష్‌తో కలిసి అన్నదానంలో పాల్గొని పేదలకు వడ్డించారు. అనంతరం మాట్లాడుతూ మొబైల్ వాహనం ద్వారా నగరంలో పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమం చేయడం హర్షణీయమన్నారు. గత కొన్ని నెలలుగా ఆసుపత్రి ప్రాంగణంలో అన్నదానం చేస్తూ పేదల కడుపులు నింపుతున్నారన్నారు. అడిషనల్ సూపరింటెండెంట్ బాలాజీనాయక్, పలు సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

### ప్రజల వద్దకే పరిపాలన



జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న సర్పంచ్ జయరావు

కొత్తపట్నం: ప్రజల వద్దకే పరిపాలన తీసికొచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే ప్రజలు మద్దతు పలుకుతున్నారు. జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం కొత్తపట్నం, రాజుపాలెం, గుండమాల, మడనూరులో నిర్వహించారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. గుండమాల సర్పంచ్ కారాని జయరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### గుండెపోటుతో యువకుడి మృతి

వేటపాలెం: జాలమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవానికి వచ్చి గుండెపోటుతో యువకుడు మృతి చెందాడు. ఈఘటన మండల పరిధిలోని కఠారివారిపాలెం మత్స్యకార గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. గ్రామస్తుల వివరాల మేరకు.. గ్రామంలో రాత్రి జాలమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం జరిగింది. తిరునాళ్ల చూడటానికి చీరాల రూరల్ మండలం పిట్టువారిపాలెం నుంచి యువకుడు శ్రీనివాసులు (37) వచ్చాడు. అయితే శుక్రవారం ఉదయం విగత జీవిగా శ్రీనివాసులు పడి ఉన్నాడు. గ్రామస్తులకు అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ఘటనా స్థలానికి చేరుకొని చూడగా యువకుడు మృతి చెంది ఉన్నాడు. యువకుడు గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

# సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ

- మరికొంత మందికి చార్జ్ మెమోలు
- వార్డు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కమిషనర్ వెంకటేశ్వరరావు



సుజాతా నగర్ సచివాలయంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, పక్కన కార్పొరేటర్

ఒంగోలు సబర్బన్: వార్డు సచివాలయాల్లో సమయానికి విధులకు హాజరుకాని సిబ్బందికి షో కాజ్ నోటీసులు జారీ చేయాలని ఒంగోలు నగర కమిషనర్ కింది స్థాయి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం నగరంలోని పలు వార్డు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. సుజాతా నగర్, గాంధీ నగర్ వార్డు సచివాలయాల్లో రిజిస్టర్‌లను పరిశీలించారు. విధులకు హాజరుకాని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్ను మొత్తం ఏకమొత్తంలో చెల్లించిన వారికి 5 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు సూచించారు. ఈ నెల 30వ తేదీతో గడువు ముగుస్తున్నందున వలంటీర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సచివాలయాల సిబ్బందిని ఆదేశించారు. ఇప్పటి వరకు పన్ను వసూళ్ళలో అలసత్వం వహించినందుకుగాను గాంధీ నగర్ సచివాలయ అడ్మిన్ సెక్రటరీ షో కాజ్ నోటీసు జారీ చేశారు. ఆయా సచివాలయ పరిధిలోని అన్ని భవనాలకు అనుమతులు ఉన్నాయో... లేదో పరీక్షించి అనుమతుల లేని గృహాల యజమానులకు నోటీసులు జారీ చేయాలని కూడా వార్డు ప్లానింగ్ సెక్రటరీలను ఆదేశించారు. విధులకు హాజరుకాని గాంధీనగర్ సచివాలయ ప్లానింగ్ సెక్రటరీకి చార్జ్ మెమో జారీ చేయాల్సిందిగా ఆదేశించారు. గాంధీనగర్ సచివాలయం పరిధిలో క్లాప్ ఆటో సక్రమంగా రావటం లేదని, యూజర్ చార్జీలు కూడా తక్కువ వసూలు చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై గాంధీనగర్ వార్డు సచివాలయ శానిటరీ సెక్రటరీకి చార్జ్ మెమో ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. క్లాప్ ఆటో ఎందుకు రావటం లేదో రిపోర్టు ఇవ్వాల్సిందిగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాబ్జీని ఆదేశించారు. మధ్యాహ్నం పూట సక్రమంగా విధులకు హాజరు కావటం లేదని, ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని శివ ప్రసాదు కాలనీ వాసులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతోవార్డు సచివాలయ సిబ్బంది అందరిపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 30కి తగ్గకుండా సర్వీసులు అందించాలని.. అలా అందించని 29 మంది సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశామని గుర్తు చేశారు. గాంధీ నగర్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ ఎటువంటి సమాచారం లేకుండా హాజరు కాకపోవటం గురించి సంబంధిత సెక్రటరీకి చార్జ్ మెమో జారీ చేయాలని ఆదేశించారు. కార్పొరేటర్లు చెన్నుపాటి వేణుగోపాల్, 33వ డివిజన్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి భాస్కర రెడ్డితో పాటు ఇతర అధికారులున్నారు.

## జగనన్న లేఅవుట్లలో గృహ ప్రవేశాలు చేయాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో సుజాత

కొత్తపట్నం: మండలంలో ఉన్న జగనన్న లేఅవుట్లల్లో గృహ ప్రవేశాలు చేయించడానికి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పి.సుజాత అధికారులను ఆదేశించారు. నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లలో భాగంగా శుక్రవారం జగనన్న కాలనీలకు సొంత స్థలం గృహ నిర్మాణాలకు సంబంధించి హౌసింగ్ లోన్స్, ఇంటి నిర్మాణ పురోగతి గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. హౌసింగ్ లేఅవుట్ వారీగా, గృహ నిర్మాణానికి వివిధ స్టేజీల గురించి వివరించారు. ఎంపీడీవో మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లు, సొంత ఇంటి నిర్మాణానికి ఎంత మందికి లోన్లు ఇప్పించాము, ఎందుకు ఇళ్లు మొదలు పెట్టలేదు పేర్లు వారీగా అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల్లో ఇంటి నిర్మాణం మొదలుపెట్టాలని ఆదేశించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరి బ్యాంక్ నుంచి సీసీఎల్, శ్రీనిధి, ఉన్నతి, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, సీఐఎఫ్ ద్వారా లోన్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హౌసింగ్ ఏఈ నాంచార్లరెడ్డి మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 1,682 మంజూరయ్యాయని బిలో బేస్మెంట్ 610, బేస్మెంట్ లెవెల్ 360, ఆర్‌సీ 124, పూర్తి అయిన ఇళ్లు 535 ఉన్నాయన్నారు. ఏపీఎం షేక్ రజియా సుల్తాన్ బేగం మాట్లాడుతూ 1,682 మంజూరైన ఇళ్లకు డీఆర్‌డీఏ ద్వారా 1,061 మందికి రూ.35,000 చొప్పున బ్యాంక్ నుంచి లోను ఇచ్చినట్లు తెలిపారు. హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ చింపిరయ్య, ఆశ, వెలుగు సీసీలు రామారావు, సుధాకర్, రమణ పాల్గొన్నారు.

# స్వచ్ఛందంగా ప్లాస్టిక్ నిషేధించాలి



సుజాత నగర్‌లో మురుగు కాలువ నుంచి వ్యర్థాలను తీయిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు



క్లాప్‌లో భాగంగా చెత్తను వేరు చేసి మూడు బుట్టల్లో వేసే విధానాన్ని వివరిస్తున్న సిబ్బంది, పక్కన కమిషనర్ వెంకటేశ్వరరావు

- నగర కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలోని ప్రజలకు చెత్త బుట్టలను ఏ విధంగా వినియోగించాలో అలవరచాలని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సిబ్బందికి సూచించారు. సుజాతా నగర్‌లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా రోజువారీ శానిటరీ పనుల పర్యవేక్షణలో భాగంగా సుజాతా నగర్ 4వ లైన్‌లో నిర్మాణ వ్యర్థాలు కాలువలో వేయటంతో మురుగు సాఫీగా పోయే వీలులేక నిలిచిపోయిందని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పారిశుద్ధ్య కార్మికులను పిలిపించి దగ్గరుండి ఆ కాలువలో అడ్డంగా వ్యర్థాలను తీసివేయించారు. దీంతో మురుగు సాఫీగా కిందకు వెళ్ళే విధంగా చర్యలు తీసుకున్నారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ఆటోలకు చెత్తను అందించే విధానంపై స్థానికులకు అవగాహన కల్పించాలని కమిషనర్ వార్డు సచివాలయ సిబ్బందితో పాటు శానిటరీ వర్కర్లకు ఆదేశించారు. ఈ రంగు బుట్టల్లో ఎలాంటి చెత్త వేయాలో సిబ్బంది స్థానికులకు వివరించారు. మూడు రంగుల బుట్టలో ఎలాంటి చెత్తను వేయాలో విపులీకరించారు. ప్లాస్టిక్‌ని వినియోగం ఆపేయాలని కమిషనర్ సూచించారు. ప్రజలు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ నిషేధానికి ముందుకు రావాలని పేర్కొన్నారు. 37వ డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## 30 నుంచి గడప గడపకు మన ప్రభుత్వం



గడప గడప కార్యక్రమంపై సమీక్షిస్తున్న ఒంగోలు కమిషనర్ వెంకటేశ్వరరావు

చీమకుర్తి: పేర్నమిట్ట పరిధిలోని 38, 39 డివిజన్‌లలో ఈనెల 30 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, కార్పొరేషన్ మేయర్ గంగాడ సుజాత ఆధ్వర్యంలో నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు ఆయా డివిజన్‌లలోని కార్పొరేటర్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో సమీక్ష నిర్వహించారు. శుక్రవారం కమిషనర్ చాంబర్‌లో సంతనూతలపాడు వైఎస్సార్ సీపీ కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, కార్పొరేషన్ పరిధిలోని ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్న వర్ధు శేషయ్య, నూకతోటి ఈశ్వరరావు, గోలి తిరుపతిరావుతో సమీక్ష నిర్వహించారు.

# స్థల వివాదాన్ని పరిష్కరించాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న కేఎన్‌పీఎస్ నిజనిర్ధారణ కమిటీ సభ్యులు

చీమకుర్తి: ఇలపావులూరు ఎస్సీ కులాలకు చెందిన రెండు వర్గాల మధ్య ఏర్పడిన స్థల వివాదాన్ని అధికారులు సత్వరమే పరిష్కరించాలని కేఎన్‌పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి దుడ్డు వెంకట్రావు అధికారులను డిమాండ్ చేశారు. గ్రామంలో సర్వే నెంబర్ 322/5లో 40 కుటుంబాలకు చెందిన పేదలు నివాసం ఉంటున్నారు. ఆ స్థలానికి ఆనుకొని ఉన్న మరొక స్థలానికి ఇరు వర్గాల మధ్య ఏర్పడిన వైషమ్యాల కారణంగా 30 కుటుంబాలకు రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురిచేయటం సరి కాదని వెంకట్రావు డిమాండ్ చేశారు. గ్రామంలో జరుగుతున్న వివాదాన్ని తెలుసుకునేందుకు కేఎన్‌పీఎస్ తరపున నిజనిర్ధారణ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఇరువైపుల ప్రజలతో సమస్య పరిష్కారం కోసం చర్చించినట్లు ఈ సందర్భంగా తెలిపారు.

## కార్పొరేట్ల చేతిలో కేంద్రం



కేవీ పాలెంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నాయకుడు ఎస్‌కే మాబు

చీమకుర్తి: విశాఖ ఉక్కుతో పాటు ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రధాని నరేంద్ర మోదీ కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్‌కే మాబు అన్నారు. శుక్రవారం రాత్రి కూనంనేనివారిపాలెంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలు-వివిధ తరగతుల ప్రజలపై ప్రభావాలు అనే అంశంపై నిర్వహించిన సభలో ముఖ్య అతిథిగా ప్రసంగించారు. పమిడి వెంకట్రావు, పూసపాటి వెంకట్రావు, స్థానికులు పాల్గొన్నారు.

# పూర్తి స్థాయిలో పనిచేయాలి



క్లాప్ మిత్రతో కాఫీ తాగుతున్న డీపీవో నారాయణరెడ్డి, రవీంద్రరెడ్డి, అధికారులు

ఈతముక్కల (కొత్తపట్నం): సిద్ధంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు పూర్తి స్థాయిలో పనిచేసి ప్రజలకు ఉపయోగపడాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండలంలో ఈతముక్కలలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. సేకరించిన చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీలకు చేర్చాలని అక్కడ రెండో విడతతో తడి, పొడి చెత్తతో పాటు హానికరమైన చెత్తను వేరు చేసి తడి చెత్తను వర్మీ కంపోస్టును తయారు చేయాలని సూచించారు. అల్లుకునే తీగ జాతి మొక్కలు నాటాలని ఆదేశించారు. వానపాములు ఎక్కువ రోజులు బతకడంతో పాటు వర్మీకంపోస్టు ఎరువును తయారు చేస్తాయన్నారు. శానిటరీ ప్యాడ్, మాస్క్ లాంటివి వేరుగా సేకరించి ఇన్సినేటర్ ద్వారా కాల్చాలని వివరించారు. జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్ర రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కిరణ్, నితిన్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

### బిల్లుల సమస్యలు పరిష్కరించండి

ఒంగోలు సబర్బన్: ఎడెడ్, మున్సిపల్ ఉపాధ్యాయుల జీతాలు, అరియర్స్ సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ యూనియన్ నాయకులు శుక్రవారం జిల్లా ఖజానా అధికార జగన్నాథరావును కలిసి విన్నవించారు. జీతాల, అరియర్స్ బిల్లులను ప్రతి నెలా సకాలంలో సీఎఫ్ఎంఎస్‌కు పంపాలన్నారు.

# ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి



బీఎల్ఓలతో మాట్లాడుతున్న సంతనూతలపాడు నియోజకవర్గ ఈఆర్ఓ వరకుమార్‌తో తహసీల్దార్

మద్దిపాడు: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని సంతనూతలపాడు ఈఆర్ఓ ఎస్. వరకుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన మండల తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలకు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల లిస్టులో డబుల్ ఎంట్రీలు, డెత్‌లు మైగ్రేటెడ్ వ్యక్తులను పక్కాగా పరిశీలించి ఓటర్ల లిస్టు నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో ఓటు లేని వారికి ఓటు హక్కు కల్పించాలని ఏ ఒక్కరూ ఓటు లేదని చెప్పకూడదని పేర్కొన్నారు. ఓటు నమోదు సమయంలో ఎటువంటి ప్రలోభాలకు గురి కారాదని హెచ్చరించారు. తహసీల్దార్ రజనీకుమారి డీటీ వెంకటేశ్వరరావు, ఎన్నికల విధుల క్లర్క్ మరియదాసు పలువురు బీఎల్ఓలు పాల్గొన్నారు.

## పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం



బాలకృష్ణా రెడ్డి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ

ఒంగోలు టౌన్: ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఈ ఏడాది మార్చి 26న అనారోగ్యంతో మరణించిన కె.బాలకృష్ణా రెడ్డి భార్య కళావతికి ఎస్పీ మలికా గర్గ్ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఇన్సిడెంటల్ చార్జెస్ కింద 25 వేల రుపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావలసిన ఇతరా ప్రయోజనాలను త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. పోలీసు కుటుంబాలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. మరణించిన పోలీసు సిబ్బంది పోలీసు శాఖలో లేకపోయినప్పటికీ పోలీసు కుటుంబంలో సభ్యులుగా పరిగణిస్తామన్నారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీపీఓ ఏఓ సులోచన పాల్గొన్నారు

# వేగంగా విద్యుదీకరణ పనులు



కరవదిలో లైన్లు లాగేందుకు గ్రామానికి చేరుకున్న విద్యుత్ తీగలు



స్తంభాలు ఏర్పాటు చేసేందుకు సిద్ధమైన కుంట

ఒంగోలు రూరల్: రీజనల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రత్యేక ఆదేశాలతో మండలంలోని పలు గ్రామాల్లోని కాలనీలకు నూతన విద్యుదీకరణ పనులు మరమ్మతులు లేకుండా పాతబడిన కండెన్సర్ల స్థానే నూతన కండెన్సర్లు ఏర్పాటు చేసినట్లు ఒంగోలు రూరల్ విద్యుత్ ఏఈ ఆర్ఆర్.చెన్నారెడ్డి తెలిపారు. శుక్రవారం కరవది గ్రామంలో నూతన స్తంభాల ఏర్పాటు, విద్యుత్ తీగల ఏర్పాటు, కండెన్సర్ల ఏర్పాటు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని సచివాలయ లైన్ మ్యాన్‌లు, విద్యుత్‌శాఖ లైన్ మ్యాన్‌లు గత 4 రోజుల నుంచి పని చేస్తున్నారని విద్యుత్ అంతరాయం కలిగిన పక్షంలో వినియోగదారులు కొంత సహకరించాలని కోరారు.

### పొగాకు అమ్మకాలు

ఒంగోలు రూరల్: రూరల్‌లోని వేలం కేంద్రం-2లో శుక్రవారం పొగాకు అమ్మకాలు కొనుగోళ్ళు జరిగాయి. కేంద్రం-2 కు 1012 బేళ్ళు రాగా, 974 బేళ్ళు రైతులు అమ్మకానికి పెట్టగా వ్యాపారస్తులు కొనుగోళ్ళు చేశారు. 2 బేళ్ళు నోబిడ్ అయ్యాయి. గరిష్ఠ ధర రూ.200, కనిష్ఠ ధర రూ.165, సరాసరి ధర రూ.194.22 గా నమోదైనట్లు వేలం-2 నిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు.

## జగనన్న కాలనీలు వేగంగా పూర్తి చేయండి



గుండాయపాలెంలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో, హౌసింగ్ డీఈ, ఏఈ

ఒంగోలు రూరల్: జగనన్న కాలనీలోని నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని ఒంగోలు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి అన్నారు. ఒంగోలు ఎంపీడీవో శుక్రవారం ఉదయం నుంచి గుండాయపాలెం, దేవరంపాడు, కరవది గ్రామ సచివాలయాలను సందర్శించారు. నిర్మాణాలను హౌసింగ్ డీఈ నారాయణ రెడ్డి, హౌసింగ్ ఏఈ పృథ్వీ గ్రామ కార్యదర్శి ఆశీర్వాదంతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక చేసి సుమారు రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందజేస్తూ జగనన్న లేఅవుట్లను ఏర్పాటు చేసిందన్నారు. హౌసింగ్ డీఈ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాలైన విద్యుత్ వసతి, తాగునీటి వసతి, రోడ్ల నిర్మాణం, కాలనీ ప్లాట్లు మెరక చేసేందుకు లక్షలాది రూపాయలు ప్రభుత్వం వ్యయం చేసిందన్నారు. పృథ్వీ మాట్లాడుతూ కాంట్రాక్టర్లను ఉద్దేశించి వేగంగా బిల్లింగ్ ఇచ్చిన గృహ యజమానులకు ప్రభుత్వం డిజైన్ ప్రకారం నాణ్యాతపరమైన లోపాలు లేకుండా నిర్మించాలని ఆదేశించారు. దేవరంపాడు సచివాలయం, దేవరంపాడు, బొద్దులూరివారిపాలెం గ్రామాల పనితీరును సమీక్షించారు. సిటిజన్ అవుట్రీచ్, ఫీవర్ సర్వే వెంటనే పూర్తి చేయాల్సిందిగా కార్యదర్శి సురేష్ కుమార్, సుజాత, శ్రీలక్ష్మిలను ఆదేశించారు. అనంతరం కరవదిలో సచివాలయాన్ని సందర్శించారు.